క్లుప్తంగా

సేవా దృక్పథం కలిగి ఉండాలి



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందజేస్తున్న అప్పారావు

విజయనగరం ఫోర్ట్: ప్రతిఒక్కరూ సేవాదృక్పథాన్ని కలిగి ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక రెయిన్ బో శిశు సంరక్షణ కేంద్రం విద్యార్థులకు బొత్స తిరుమల సమకూర్చిన పుస్తకాలు, బ్యాగులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు సుధారాణి, మిషన్ వాత్సల్య జిల్లా అధికారి అల్లు సత్యనారాయణ, సిబ్బంది యాళ్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను కాపాడుకోవాలి



చిన్నారులకు చెప్పులు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు, పోలీసులు

విజయనగరం: వేసవితాపం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చిన్నారులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని మేమున్నాం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు కె.సత్యనారాయణ మూర్తి పిలుపునిచ్చారు. కంటోన్మెంట్ ప్రాంతంలో రోడ్డు పక్కన నివసిస్తున్న కొంతమంది నిరుపేద చిన్నారులకు శనివారం చెప్పులు పంపిణీ చేశారు. ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ దామోదర్, కానిస్టేబుల్ మజ్జి హరికృష్ణ చేతులమీదుగా పాదరక్షలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డోకి చంద్రశేఖర్, పి.మురళి, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

నెల్లిమర్ల: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో రానున్న ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని ఏఓ ఎం. పూర్ణిమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 30 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. 10 కిలోల కట్టె జనుము రాయితీపై రూ. 420, జీలుగ రూ. 395 కాగా జీలుగ 8 కిలోల ప్యాకెట్ 388 రూపాయలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన రైతులు తమ ఆధార్ కార్డుతో పాటు వన్‌బీ తీసుకెళ్లి ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఖరీఫ్‌ను దృష్టిలో పెట్టుకుని 127 మెట్రిక్ టన్నుల ఎరువులను ఆర్బీకేల్లో నిల్వ ఉంచామని తెలిపారు. అలాగే 1300 క్వింటాళ్ల వరి విత్తనాలకు ఇండెంట్ పెట్టినట్లు చెప్పారు.

నగదు మాయంపై ఫిర్యాదు

పూసపాటిరేగ: మండల కేంద్రానికి చెందిన తిరుమలరాజు వరహవెంకట నరసింహరాజుకు స్థానిక ఎస్‌బీఐ ఖాతా ఉంది. ఈ ఖాతా నుంచి ఈ నెల 4వ తేదీ నుంచి ఏడు వరకు విడతల వారీగా 39 వేల రూపాయలు విత్‌డ్రా అయ్యాయి. దీంతో బాధితుడు బ్యాంక్ ఖాతా నుంచి నగదు మాయంపై పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ. నరేష్ తెలిపారు.

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం రేపు

నెల్లిమర్ల: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 22న నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ బంగారు సరోజిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి 20 వార్డుల కౌన్సిలర్లు, అన్ని విభాగాల అధికారులు హాజరుకావాలని సూచించారు. వీధిలైట్ల నిర్వహణకు అవసరమయ్యే పరికరాల కొనుగోలు, తాగునీటి సరఫరాకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు.

సంపూర్ణ సురక్ష కేంద్రం ప్రారంభం

విజయనగరం ఫోర్ట్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన సంపూర్ణ సురక్ష కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఎస్.వి.రమణ కుమారి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. ఎయిడ్స్‌తో బాధపడుతున్న వారికి చికిత్స అందించడంతో పాటు హెచ్‌ఐవీ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే వారికి, వారి భాగస్వామికి పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ అయితే కౌన్సిలింగ్, నిరంతర పర్యవేక్షణ, మందుల పంపిణీ వంటివి చేయడం సంపూర్ణ సురక్ష కేంద్రం లక్ష్యమన్నారు. హెచ్‌ఐవీ సోకిన వారి పట్ల చిన్నచూపు చూడకూడదని, వ్యాధి సోకగానే చనిపోరన్న నమ్మకం వారికి కలిగించి, అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ఎయిడ్స్ బారినపడకుండా ఉండేందుకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలీల, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ శంబంగి అప్పలనాయుడు, డీసీహెచ్‌ఎస్ బి.గౌరీశంకర్, డిప్యూటీ సూపరింటెండెంట్ బొత్స సంతోష్, ఆర్ఎంఓలు సురేష్ కుమార్, లక్ష్మణరావు, ఎన్‌సీడీ వైద్యాధికారి జి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే తలమానికం

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



సేవావజ్ర అవార్డులు దక్కించుకున్న వలంటీర్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, నగర మేయర్, తదితరులు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో అమలవుతున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే తలమానికమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రజలు, అధికారులకు మధ్య వారధిలా వ్యవహరిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్లు మరింత ఉత్తమ సేవలందించాలని ఆకాంక్షించారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న పురస్కారాలను శనివారం ప్రదానం చేశారు. కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో నగరంలోని 61 సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న కంది. శివశంకర్, అంబటి పరమేశ్వరరావు, రాజేశ్వరిలకు సేవావజ్ర పురస్కారాలు ప్రదానం చేయగా... మరో 10 మంది వలంటీర్లకు సేవారత్న అవార్డులు అందజేశారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, 2022లో సచివాలయాల ద్వారా 79,797 పౌరసేవలు అందించగా, 2023 జనవరి నుంచి ఇప్పటివరకు 65,014 పౌరసేవలు వలంటీర్ల ద్వారా అందజేసినట్లు చెప్పారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిఏటా పురస్కారాలను ప్రదానం చేస్తోందని, ఇందులో భాగంగానే వలంటీర్లను సత్కరించినట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాము గ్రామలు, పట్టణాల్లో పర్యటిస్తుంటే వలంటీర్లర సేవలపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నార న్నారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, వలంటీర్ల సేవల పట్ల ప్రజలలో రోజురోజుకీ ఆదరణ పెరుగుతుందన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, పురస్కార గ్రహీతలు, తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

పూసపాటిరేగ: ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు మరువలేనివి అని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని కుమిలి-1, కుమిలి-2, చల్లవానితోట, రెల్లివలస గ్రామాలలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సచివాలయ వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వలంటీర్లు తక్కువ జీతాలతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. కరోనాలాంటి విపత్కర సమయంలో వలంటీర్లు సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రామారావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, పడాల శ్రీధర్, గాబు సూరప్పన్న రెడ్డి, పతివాడ వరలక్ష్మి, పతివాడ శ్రీనివాసురావు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సేవా వారధులు..

విజయనగరం రూరల్: గ్రామ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సేవా వారధుల్లా పనిచేస్తున్నారని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండల పరిధిలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 248 మంది గ్రామ వలంటీర్లు పని చేస్తున్నారు. వీరి సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ప్రతి ఏటా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులు ప్రదానం చేస్తుంది. ఇందులో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వలంటీర్లను సత్కరించారు. రాకోడు, జొన్నవలస గ్రామ సచివాలయాల్లో ఉత్తమ సేవలు అందించిన ఒక్కో వలంటీర్‌కు సేవా వజ్ర అవార్డుతో సన్మానించారు. అలాగే సేవారత్న అవార్డు కోరుకొండలో ఇద్దరికి, దుప్పాడ, కొండకరకాం, బియ్యాలపేటలో ఒక్కొక్కరికి రాగా.. మిగతా గ్రామ వలంటీర్లకు సేవామిత్ర అవార్డులు వరించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ అప్పలనాయుడు మాట్లాడుతూ, వలంటీర్ల సేవలు చరిత్రాత్మకమని, నిస్వార్థంగా సేవలందిస్తున్న గ్రామవలంటీర్లు జగనన్న సైన్యమని తెలిపారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తీసుకువచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, వైఎస్ ఎంపీపీలు కొసర నిర్మల, కర్రోతు నారాయణ, ఎంపీడీఓ గంటా వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండలశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: సత్కారం పొందిన వలంటీర్లతో అధికారులు, ప్రజాప్రతినిధులు



విజయనగరం రూరల్: గ్రామ వలంటీర్‌కు సేవా రత్న పురస్కారాన్ని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



విజయనగరం రూరల్: సమావేశానికి హాజరైన గ్రామ వలంటీర్లు

దేశానికే ఆదర్శం

• ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిద విజయరామపురం సచివాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 23 మంది వలంటీర్లను అభినందించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు దోచుకున్నారని ఆరోపించారు. వలంటీర్లు మరింత కష్టపడి పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావు, నాయకులు లెంక గోవింద, శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: మొయిద సచివాలయంలో వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు

రాష్ట్రంలో అవినీతి రహిత పాలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్రంలో అవినీతి, లంచగొండితనం లేని పాలన సాగుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని 30వ డివిజన్ కొత్త ధర్మపురిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, ప్రభుత్వ పాలనాపగ్గాలు చేపట్టి మూడేళ్లు పూర్తయిన తర్వాత ప్రభుత్వ విధానాలను ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకు గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు దీవించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌చార్జ్‌లు బాల బ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ పతివాడ గణపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

• మండల ప్రత్యేకాధికారి రమణమూర్తి

నెల్లిమర్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ద్వారా పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా హౌసింగ్ అధికారి, మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీ రమణమూర్తి ఉపాధ్యాయులను ఆదేశించారు. నగర పంచాయతీ పరిధిలోని రెల్లివీధి బాలికోన్నత, జరజాపుపేట ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న పదో తరగతి ప్రత్యేక తరగతులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ సప్లిమెంటరీ పరీక్షల్లో పాస్ కావాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో చేపడుతున్న నాడు-నేడు అభివృద్ధి పనులపై ఆరా తీశారు. పాఠశాలల పునః ప్రారంభానికి పనులన్నీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆయన వెంట నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్, ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, నాడు-నేడు కార్యక్రమం ఏఈ శ్రీరాముల నాయుడు, హౌసింగ్ ఏఈ ఆర్. పవన్ ఉన్నారు.



నెల్లిమర్ల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమణమూర్తి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



నందిగాం పంచాయతీ జగనన్న కాలనీలోని లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుధారాణి

• మండల ప్రత్యేకాధికారి ఎం.సుధారాణి

భోగాపురం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి అధికారులకు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా అధికారులతో కలిసి మండలంలోని నందిగాం పంచాయతీ జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను శనివారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయం, ఇసుక, సిమెంట్, ఐరన్ వంటి నిర్మాణ సామాగ్రితో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గరే మురళీమోహనరావు, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, హౌసింగ్ డీఈ మరళీ, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏపీఓ ఆదిబాబు, ఏపీఎం రమణ, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌లో రూ. 11 వేల రికవరీ



మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఉపాధి సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

డెంకాడ: మండలంలో 2022 – 23 సంవత్సరానికి సంబంధించి (17వ విడిత) నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పలు రకాల పొరపాట్లు కారణంగా ఎఫ్ఏలు, టెక్నికల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల నుంచి రూ. 11 వేల రికవరీకి అధికారులు ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ప్రిసైడింగ్ అధికారి, ఏపీడీ టి.జనార్ధనరావు, అంబుడ్స్‌మన్ అన్నపూర్ణ, డీవీఓ రవీంద్ర, ఏడీవీఓ ఎల్‌వీ నాయుడు, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ అచ్యుత్ ఆధ్వర్యంలో ప్రజావేదిక జరిగింది. మస్తర్లు ఆన్‌లైన్ కాకపోవడం, దిద్దుబాట్లు, కొలతల్లో పొరపాట్లు వెలుగు చూశాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూపారాణి, ఏపీఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీలోని గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్‌స్కూల్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో ప్రవేశాలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 22 నుంచి వచ్చే నెల 7వ తేదీ లోగా నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డిబెట్ కార్డులను ఉపయోగించి గేట్ వే ద్వారా అప్లికేషన్ రుసుం చెల్లించాలన్నారు. ఈ సమయంలో ఒక జర్నల్ నంబర్ వస్తుందని, ఆ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు ఓసీ, బీసీ, ఈడబ్ల్యుఎస్ వారు రూ.200.. ఎస్సీ, ఎస్టీలు 150 రూపాయలు చెల్లించాలన్నారు.

స్వచ్ఛ నగర్‌కు సహకరించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ సరోజిని, తదితరులు

నెల్లిమర్ల: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'మేరా లైఫ్ - మేరా స్వచ్ఛనగర్' కార్యక్రమానికి పట్టణవాసులు సహకరించాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా నిరుపయోగ వస్తువులను సేకరించడానికి పట్టణంలోని 20 వార్డుల్లో ఏర్పాటు చేసిన రెడ్యూస్ - రీయూజ్ - రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) స్టాల్స్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 21 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు సదరు స్టాల్స్ ద్వారా నిరుపయోగమైన వస్తువులను సేకరించడం జరుగుతుందని చెప్పారు. పట్టణవాసులు ప్లాస్టిక్ వస్తువులు, పుస్తకాలు, అట్టలు, కాగితాలు, దుస్తులు, బూట్లు స్టాల్స్‌కు అందజేయాలని సూచించారు. తద్వారా నగర పంచాయతీని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడానికి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, నగర పంచాయతీ మేనేజర్ టీవీఎస్ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ సర్వేపై అవగాహన

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం సర్వేపై శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. పట్టణ పరిధిలోని 20 వార్డుల్లో పూర్తిస్థాయిలో డ్రోన్ సర్వే నిర్వహిస్తామని కమిషనర్ పి. బాలాజీప్రసాద్, చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు తెలిపారు. సుమారు 6500 హేబిటేషన్లతో పాటు ప్రభుత్వ చెరువులు, కొండలు, స్థలాలను సర్వే చేస్తారన్నారు. సర్వే అనంతరం సర్వే రాళ్లు పాతి హద్దులు గుర్తిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీపీబీఓ జనార్ధనరావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, స్థానిక పెద్దలు పొంద్రంకి సత్యనారాయణ, పోలుబోతు నారాయణమూర్తి, నల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు 594 దరఖాస్తులు

నెల్లిమర్ల: పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షకు 594 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేబీబీ రావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రవేశాల కోసం ఈ నెల 28న నెల్లిమర్ల, గజపతినగరం ఎంజేపీఏపీ పాఠశాలల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. నెల్లిమర్ల పరీక్ష కేంద్రంలో 403 మంది, గజపతినగరంలో 191 మంది పరీక్ష రాయనున్నారని, ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

'జగనన్నకు చెబుదాం'పై అవగాహన కల్పించాలి

భోగాపురం: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి అధికారులకు సూచించారు. మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'నాడు-నేడు' ఫేజ్-2లో భాగంగా చేడుతున్న పాఠశాలల భవన నిర్మాణాలు, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సచివాలయ, వెల్‌నెస్, రైతుభరోసా భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ సురేష్, సీడీపీఓ ఎస్తేరురాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుధారాణి

నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి



శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు, తదితరులు

• ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు

విజయనగరం పూల్‌బాగ్: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అమర్‌భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఉత్తరాంధ్ర విద్యా, వైజ్ఞానిక, సైద్ధాంతిక, రాజకీయ శిక్షణ తరగతులు మే 29 30 31 తేదీల్లో జరుగుతాయని చెప్పారు. ఈ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో, దేశంలో నూతన విద్యా విధానం పేరుతో దేశాన్ని కాషాయీకరణ చేస్తున్నారని ఆరోపించారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల చాలా మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్. నాగభూషణం, జిల్లా సహాయ సహాయ కార్యదర్శులు పి. గౌరీశంకర్, బి.వాసు, పట్టణ అధ్యక్షులు ఎ. సుమన్, రమేష్ సతీష్, పవన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ చెరువు ప్రారంభం

భోగాపురం: అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని నందిగాం పంచాయతీ పరిధిలో సుమారు రూ.2.40 లక్షల ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన అమృత్ సరోవర్ చెరువును కలెక్టర్ నాగలక్ష్మి శనివారం ప్రారంభించారు. నందిగాం పంచాయతీని జిల్లాలో ఆదర్శ పంచాయతీగా నిలిపించేందుకు కృషి చేసిన సర్పంచ్ గరే మురళీమోహనరావు అభినందించారు. అనంతరం చెరువు గట్టుపై మొక్కలు నాటారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి, మండల ప్రత్యేకాధికారి ఎం.సుధారాణి, ఎంపీడీఓ దాసరి బంగారయ్య, తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఏపీఓ ఆదిబాబు, ఏపీఎం రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నందిగాంలో అమృత్ సరోవర్ చెరువును ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి